www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

గురువారం | 25 | డిసెంబర్ | 2025

పేజీలు : 8

## సాగర్ కాలువలో పడి ఇద్దరు విద్యార్థులు గల్లంతు



**-ఒకరి మృతదేహం లభ్యం**

ప్రజాపక్షం/ ఖమ్మం క్రైం : ఈతకు వెళ్లి సాగర్ కాలువలో పడి ఇద్దరు విద్యార్థులు గల్లంతైన సంఘటన ఖమ్మం నగర పరిధిలోని సుల్తాన్ నగర్‌లో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... సుల్తాన్ నగర్‌కు చెందిన పెయింటర్ ఎడ్ల లక్ష్మయ్య కుమారుడు ఎడ్ల శశాంక్ (14) తొమ్మిది

మిగతా 2లో..

# దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలు



ప్రజాపక్షం/ ఖమ్మం : భారతదేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలవుతుందని ఎన్డిఏ ప్రభుత్వం ప్రశ్నించే వారిని నిర్బంధాలకు గురి చేస్తుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. నిన్నటి వరకు స్వదేశ పౌరులపైనే మావోయిస్టుల పేరుతో యుద్ధం చేసిన బిజెపి ఇప్పుడు ప్రభుత్వానికి వ్యతిరేకంగా

మిగతా 2లో..

**-సిపిఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించండి**
**-జనవరి 18న జరిగే బహిరంగ సభను జయప్రదం చేయండి**
**-సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**

## ప్రతిభావంతమైన
# వ్యవస్థను రూపొందించండి




ప్రజాపక్షం/ ఖమ్మం : ప్రతిభావంతమైన వ్యవస్థను రూపొందించడమే లక్ష్యంగా పని చేయాలని జిల్లా అధికారులకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. నేటి విద్యార్థులే రేపటి రాష్ట్ర భవిష్యత్తు అని ప్రపంచ దేశాలతో పోటీపడేవిధంగా రాష్ట్రం ఉండాలంటే అత్యుత్తమ ఫలితాలను సాధించడంతో పాటు నాణ్యమైన మానవ వనరులను దేశానికి అందించాలని ఆయన సూచించారు. బుధవారం ఖమ్మం కలెక్టరేట్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి విద్య, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు.

మిగతా 2లో..

**-విద్యార్థులే రేపటి రాష్ట్ర భవిష్యత్తు**
**-విద్య, సంక్షేమం పట్ల నిర్లక్ష్యాన్ని సహించం**
**- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క**

## కోటిన్నర విలువైన గంజాయి పట్టివేత



**-కంటైనర్ ద్వారా చెన్నైయ్‌కు తరలింపు**
**-పోలీసుల అదుపులో నలుగురు**

ప్రజాపక్షం/ఖమ్మం/అశ్వారావుపేట : కోటిన్నర విలువైన గంజాయి పట్టుబడిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట నియోజక వర్గంలోని అచ్చితాపురం క్రాస్ రోడ్డు వద్ద బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు ఎన్ని చర్యలు తీసుకున్నా గంజాయి రవాణా మాత్రం ఆగడం లేదన్న దానికి ఇది ఒక ఉదాహరణ. ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల్లో పండించిన గంజాయిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ల మీదుగా దేశంలోని ప్రముఖ నగరాలకు రవాణా చేస్తున్నారు. దమ్మపేట పోలీసులు తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఖమ్మం సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ. 1.52 కోట్ల విలువైన 304 కేజీల గంజాయి పట్టుబడింది. రాజమండ్రి నుంచి సత్తుపల్లి వైపు వస్తున్న టాటా మోటార్ గూడ్స్ కంటైనర్‌ను టిఎన్ 73ఎడి9515 వాహనానికి ఒక సీక్రెట్ చాంబర్‌ను తయారు చేశారు. ఆ చాంబర్‌లో ఒక్కొక్కటి రెండు కేజీల చొప్పున 152 ప్యాకెట్లను సీక్రెట్ చాంబర్‌లో

మిగతా 2లో..

## వేగు చుక్క మెరిసింది..లోకం మురిసింది..!





**-ప్రేమామృతం పంచిన కరుణామయుడు**
**-నేడు క్రిస్మస్**
**-చర్చిలల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు**

ప్రజాపక్షం/బూర్గంపాడు: ప్రేమ, కరుణా, జాలి, దయ గుణాల సందేశాన్ని ప్రపంచ మానవాళికి పంచి పెట్టిన కరుణామయుడు పుట్టిన పవిత్రమైన రోజు క్రీస్మస్ పండుగ. ఈ పండుగ అనగానే కొత్త బట్టలు, కేకు కటింగ్, ఇంటి పైన స్టార్స్,క్రిస్మస్ ట్రీ,క్రిస్మస్ తాతయ్య గుర్తుకు వస్తాయి. ప్రపంచకాలాన్ని క్రీస్తు శకంగా,క్రీస్తు పూర్వంగా విడదీసి చూస్తున్నారంటే యేసు ప్రభువు ఎంతటి మహోన్నతుడో, ఎంతటి మార్గదర్శకుడో మనం అర్థం చేసుకోవచ్చు,ఆ కరుణామయుని క్రీస్మస్ పర్వదినం సందర్భంగా ప్రజాపక్షం అందిస్తున్న ప్రత్యేక కథనం

### క్రిస్మస్ ఆవిర్భావం...

క్రిస్ట్, మాసీ అనే ఇంగ్లీష్ పదాల కలయిక వల్లే క్రీస్మస్ అనే పదం అవిర్భవించింది. లాటిన్ భాషలోని మిస్సా(ది హోలీ మాస్)అను పదానికి పర్యాయ పదంగా వచ్చిందని చెప్తుంటారు. గ్రీకు భాషలోని క్రిస్టోస్ అనే పదం నుంచి క్రిస్మస్ పుట్టిందని

మిగతా 2లో..

# దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ అమలు

(మొదటిపేజీ తరువాయి)
మాట్లాడుతున్న వారిని అరెస్టులు చేస్తుందని ఆయన తెలిపారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం బుధవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో పగడాల మల్లేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కూనంనేని మాట్లాడుతూ మతం, కులం పేరుతో దేశ ప్రజలను విభజిస్తూ రాముడి పేరుతో ప్రజలను మభ్యపెడుతూ దేశాన్ని ఒక సంక్లిష్ట స్థితికి తీసుకెళ్లేందుకు బిజెపి ప్రయత్నిస్తుందన్నారు. ఆర్థిక వ్యవస్థను బిజెపి విధానాలు తీవ్రంగా దెబ్బతీశాయని పెరుగుతున్న ఆర్థిక అంతరాలు దేశ భవిష్యత్తుకు పెను ముప్పుగా మారనున్నాయని ఆయన తెలిపారు. దేశ సంపదను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతున్న బిజెపి అర్బన్ నక్సల్స్ పేరుతో తనను ప్రశ్నించే వారిని నిర్బంధాలకు గురి చేసి జైళ్లలో పెట్టాలని ప్రయత్నిస్తున్న క్రమంలోనే ఇన్నయ్య అరెస్టు జరిగిందన్నారు. ఇటువంటి అరెస్టులను సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందని నిర్బంధాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి పోరాటం చేస్తామని కూనంనేని హెచ్చరించారు. బిజెపి అనుకూలురైన సంపన్న వర్గాల కోసం కీలక నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన తెలిపారు. కమ్యూనిస్టుల పట్ల కక్షపూరిత వైఖరిని అవలంభిస్తుందన్నారు. బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాట కార్యాచరణతో ముందుకెళ్తామని కూనంనేని తెలిపారు. పార్టీ 100వ ఆవిర్భావ దినోత్సవం డిసెంబర్ 26న వాడ వాడలా నిర్వహించాలని ఆయన తెలిపారు. ఉత్సాహపూరిత వాతావరణంలో ఆవిర్భావ దినోత్సవాలను జరపడంతో పాటు శతాబ్ది ఉత్సవ సందేశాన్ని ప్రతి ఒక్కరికి చేరవేయాలన్నారు. జనవరి 18న ఖమ్మంలో జరిగే చారిత్రిక సభకు ఐదు లక్షల మంది హాజరుకానున్నారని కూనంనేని తెలిపారు. వందేళ్ల పోరాట చరిత్రను నేటి తరానికి తెలియజేసే రీతిలో ఊరువాడ ఉత్సవ కార్యక్రమాలు నిర్వహించాలని గ్రామగ్రామానికి, ఇంటింటికి శతాబ్ది ఉత్సవ ముగింపు సమాచారాన్ని చేరవేయాలని ఆయన పిలుపునిచ్చారు. 40 దేశాల నుంచి ప్రతినిధులు సౌహార్ద సందేశాలు ఇచ్చేందుకు వస్తున్నారని దేశంలో భారత కమ్యూనిస్టు పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తూ అన్ని రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ఈ చారిత్రిక ఉత్సవ బాధ్యతను ఖమ్మంజిల్లా కమ్యూనిస్టు పార్టీ స్వీకరించడం అభినందనీయమని అదే రీతిలో ఏర్పాట్లు జరగాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రతిభావంతమైన వ్యవస్థను రూపొందించండి

(మొదటిపేజీ తరువాయి)
ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరం నాటికి మధిర నియోజక వర్గ పరిధిలో చేపట్టిన మోడల్ పాఠశాలల అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. 1,73,000 మంది విద్యార్థులు వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్నారని వారందరికీ ఆంగ్లం, గణితం, విజ్ఞాన శాస్త్రంలో అత్యుత్తమ బోధన చేసే వారిని గుర్తించి జిల్లా వ్యాప్తంగా ఆ అధ్యాపకులచేత బోధన చేయించాలని జిల్లా అధికార యంత్రాంగానికి భట్టి సూచించారు. ఇంటిగ్రేటెడ్ యంగ్ ఇండియా స్కూల్స్ పై సమీక్ష చేసిన విక్రమార్క వీటి నిర్మాణంలో జరుగుతున్న జాప్యం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పాలేరులో కనీస పనులు ప్రారంభించకపోవడం వెనక కారణం ఏమిటని సంబంధిత అధికారిని ప్రశ్నించారు. గురుకులాల్లో బోధన పద్ధతులు, నాణ్యమైన ఆహారం, పరిశుభ్రత, ఆరోగ్యం, అవసరమైన సౌకర్యాల కల్పనకు జిల్లా అధికారులు కృషి చేయాలని త్వరలో అన్ని సంక్షేమ వసతి గృహాలను ఆకస్మిక తనిఖీ చేస్తామని ఆయన హెచ్చరించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోనూ విద్యార్థులకు ఆన్‌లైన్ పద్ధతిలో ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చూడాలని అన్ని గురుకులాలకు వీలైనంత త్వరలో సొంత భవనాలను నిర్మిస్తామని అందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం, మంచి నైపుణ్యాలు, నాణ్యమైన సౌకర్యాలు చిన్నతనం నుంచి అందిస్తే మన రాష్ట్రానికి మంచి సంపద సృష్టించే మానవ వనరులు తయారవుతాయని ఆయన తెలిపారు. ప్రైవేటు పాఠశాలల పట్ల జిల్లా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కొన్ని పాఠశాలల్లో గోడౌన్స్‌లో కుక్కినట్లు విద్యార్థులను ఉంచుతున్నారని దీనిపై అధికారులు పరిశీలన చేయాలని ఆయన ఆదేశించారు. ప్రైవేట్ విద్యా సంస్థలు రెన్యూవల్ చేసేటప్పుడు ప్రభుత్వం ఇచ్చిన చెక్‌లిస్ట్‌ను పరిశీలించాలని ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా రెన్యూవల్ చేసినా, అనుమతులు ఇచ్చినా సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. జనవరి 15లోపు ఇంటర్ విద్యా సంస్థల మరమ్మతు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించిన భట్టి జిల్లాలో మంజూరైన



ఐదు జూనియర్ కళాశాలల నిర్మాణానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను నెలకొకసారి ప్రభుత్వ వైద్యులు పరీక్షించి ఆరోగ్య కార్డులు అందజేయాలన్నారు. హాజరు విషయంలో ఖచ్చితంగా నిబంధనలు పాటించాలని శాసన సభలోనే హాజరును ప్రవేశపెట్టినప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశపెట్టడానికి ఇబ్బంది ఏమిటని ఆయన ప్రశ్నించారు. జవాబుదారితనంతో పనిచేసినప్పుడే ఫలితాలు వస్తాయని ప్రభుత్వ ఉద్యోగులు అలసత్వంవహించినా సహించబోమని ఈ ప్రభుత్వం ప్రజల పక్షాన పని చేస్తుందని ఆయన తెలిపారు ఈ సమీక్షా సమావేశంలో వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్, అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఐటిడిఏ పిఓ బి. రాహుల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లాలో వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**తనికెళ్ల గురుకుల పాఠశాల సందర్శన ...**

ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం తనికెళ్ల బాలికల గిరిజన గురుకుల పాఠశాలను మల్లు భట్టివిక్రమార్క, వైరా శాసన సభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ తో కలిసి పరిశీలించారు. గురుకులంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఉపాధ్యాయ బృందాన్ని అడిగి సమస్యలకు సంబంధించి వెంటనే ప్రభుత్వానికి ఒక నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. విద్యార్థులకు బోధన, మెనూ అమలు తదితర విషయాలపై ప్రశ్నించారు.

# వేగు చుక్క మెరిసింది..లోకం మురిసింది..!

(మొదటిపేజీ తరువాయి)
మరికొందరు చెప్తుంటారు.

**పశువుల పాకలో ప్రభువు జననం...**

బెత్లహేమ్‌లోని పశువుల పాకలో అర్ధరాత్రి మేరీ మాత, యేసోబు దంపతులకు యేసు క్రీస్తు జన్మించారు. క్రీస్తు పుట్టగానే దివ్యదూత ప్రత్యక్షమైయి బెత్లహేమ్ నగర శివారులో నివశించే జ్ఞానులకు,గొర్రెల కాపరులకు విషయం తెలియజేసింది.అప్పుడు ఆకాశంలోని దివ్యతార దారి చూపగా వారు పరుగున పశువుల పాకకు వచ్చి బాల యేసును చూసి తరించారు.ఆ తరువాత జ్ఞానులు బాల యేసునికి బంగారం, కస్తూరి సుగంధ,ద్రవ్యాలను సమర్పించి ధన్యాత్ములయ్యారని ప్రచారంలో ఉంది. అప్పటి నుంచి ప్రతి డిసెంబర్ 24 అర్ధరాత్రి దాటిన తరువాత క్రిస్మస్ పండుగను క్రైస్తవులు ఘనంగా జరుపుకుంటారు.

**బోలెడు బహుమతులిచ్చే క్రిస్మస్ తాత....**

క్రిస్మస్ తాత సంప్రదాయం మూడవ దశాబ్దంలో పరిచయమయ్యాడు. డెన్మార్క్ సెయింట్ నికొలస్ అనే భక్తి పరుడైన క్యాథలిక్ బిషప్ ఉదంతాలే శాంతాక్లాజ్ సృష్టికి మూలమని చెబుతారు.నికొలస్ బిషప్‌గా ఉన్న ప్రదేశంలో ఒక పేద రైతు తన కుమార్తెలకు కట్నాలు ఇచ్చి పెళ్ళి చేయలేక అవస్థలు పడుతుంటాడు. దాంతో నికొలస్ బిషప్



బంగారు నాణాలున్న మూడు చిన్న మూటలను చిమ్నీ దారా ఇంట్లోకి వదిలి వెళ్తాడు. అలా వదిలిన జారి అక్కడే అరబెట్టి ఉన్న సాక్స్‌లో పడ్డాయి అని అలా ఆయన చేసిన మేలు ఒక పేద రైతు ఇంట్లో ఆనందాన్ని నింపింది. క్రిస్మస్ ముందు రాత్రి పడుకున్న తరువాత క్రిస్మస్ తాత ఇంటింకి వెళ్లి బహుమతులు ఇంటి ముందు పెట్టి తలుపు కొట్టి వెళ్లి పోయేవారు అలా మనం క్రిస్మస్ తాత అని అంటాం. విదేశాల్లో అయితే శాంతాక్లాజ్ అంటారు

# సాగర్ కాలువలో పడి ఇద్దరు విద్యార్థులు గల్లంతు

(మొదటిపేజీ తరువాయి)
తరగతి చదువుతున్నాడు. అదే ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ ఎండి వహబ్ కుమారుడు ఎండి అబ్దుల్ సుహన్ తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. వీరితో పాటు ఈశ్వర్ అనే విద్యార్థి ముగ్గురు కలిసి సాగర్ కాలువ వద్దకు వెళ్లి ఈతకు దిగారు. ఈ క్రమంలో కాలువ నీటి ప్రవాహంలో ప్రమాదవశాత్తు శశాంక్, అబ్దుల్ సుహన్ కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, పోలీసులు, కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య నాగరాజు ఘటన స్థలానికి చేరుకుని ఇరువురి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వారిలో శశాంక్ మృతదేహం లభ్యమైంది. మరొకరి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దీనితో సుల్తాన్ నగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. వహబ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ బాలకృష్ణ తెలిపారు.

# కోటిన్నర విలువైన గంజాయి పట్టివేత

(మొదటిపేజీ తరువాయి)
అమర్చారు. ఈ వాహనానికి ముందు ఎస్కార్ట్‌గా ఒక ఎర్టిగా వాహనం వెళ్తుంది. అనుమానాస్పద పరిస్థితులు ఏర్పడగానే కంటైనర్‌లో ఉన్న వ్యక్తులకు సమాచారం ఇచ్చి దారి మళ్లింపు చేపడతారు. కానీ పోలీసులు చాకచక్యంగా ముందు ఎస్కార్ట్ వాహనాన్ని ఆపి దానికి నకిలీ నెంబర్ అమర్చినట్లుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తర్వాత కంటైనర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులు తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రంలోని చిత్రకొండ సమీపంలోని బానందులి గ్రామం వద్ద సాధు గురుజీ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి అక్కడి నుంచి కారులో రాజమండ్రి తరలించారు. రాజమండ్రిలో ఒక కంటైనర్‌కు చాంబర్ తయారు చేసి చాంబర్‌లో గంజాయిని అమర్చి అశ్వారావుపేట, సత్తుపల్లి, విజయవాడ మీదుగా చెన్నైయ్ తరలించేందుకు ప్రయత్నించారు. చెన్నైయ్‌లో ఉన్న ప్రముఖ గంజాయి స్మగ్లర్ విక్రం వద్దకు ఈ గంజాయిని తీసుకెళ్తున్నట్లు నిందితులు తెలిపారు. దమ్మపేట పోలీసులు వివిధ సెక్షన్ల క్రింద కేసులు నమోదు చేసి 304 కేజీల గంజాయి, టాటా కంటైనర్ లారీ, ఎర్టిగా కారు, ఐదు మొబైల్ ఫోన్లు, రూ. 4,500 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో విశాఖపట్నంకు చెందిన వంతల యమలయ్య, తమిళనాడు తిరువళ్లూరుకు చెందిన బి. అర్జున్, తమిళనాడు రాష్ట్రానికి చెందిన ఇద్దరు విద్యార్థులు షణ్ముగం, దేవాకర్ ను అదుపులోకి తీసుకున్నారు. చెన్నైయ్‌కు చెందిన గంజాయి స్మగ్లర్ విక్రం ఒడిశా నుంచి గంజాయి సరఫరా చేస్తున్న సాధు గురుజీ, తమిళనాడు రాష్ట్రానికి చెందిన లారీ యజమాని సుబ్రమణ్యం, ఎర్టిగా కారు యజమాని మహారాష్ట్రకు చెందిన వికాస్‌అంకుష్ తంగడి పరారీలో ఉన్నారు. పట్టుబడిన నలుగురు నిందితులను కోర్టుకు తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు.

**ఉన్నతాధికారుల అభినందనలు...**

నిషేధిత గంజాయి అక్రమ రవాణాను సమర్థవంతంగా అడ్డుకున్నందుకు పోలీస్ ఉన్నతాధికారులు అభినందించారు. అశ్వారావుపేట సిఐ నాగరాజు, దమ్మపేట ఎస్ఐ సాయికిషోర్ రెడ్డి, తెలంగాణ ఈగల్ టీం, సిబ్బందిని కొత్తగూడెం ఎస్పి రోహిత్‌రాజ్ అభినందించారు. గంజాయి తరలించినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

# సర్పంచ్‌ను సన్మానించిన మెకానిక్ యూనియన్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : టూ వీలర్ మెకానిక్ గా పని చేస్తూ సర్పంచ్‌గా ఎన్నికైన ఆవుల నర్సింహారావును ఖమ్మం కార్పొరేషన్ టూ వీలర్ మెకానిక్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. గత 20 ఏళ్లుగా ఖమ్మం



లో టూ వీలర్ మెకానిక్‌గా పనిచేస్తున్న ఆవుల నర్సింహారావు ఇటీవల జరిగిన ఎన్నికల్లో చింతకాని మండలం బస్వాపురం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఖమ్మం కార్పొరేషన్ టూ వీలర్ మెకానిక్ ఆధ్వర్యంలో ఆవుల నర్సింహారావును శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు వంగాల కొండలరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ముగ్గురు మెకానిక్‌లు సర్పంచ్‌గా గెలవడం అభినందనీయమన్నారు. సర్పంచ్ ఆవుల నర్సింహారావు మాట్లాడుతూ గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు నున్నా అప్పారావు, గౌరవ సలహాదారుడు షేక్ అమీద్, బ్రహ్మం, మురళి, బుల్లెట్ అన్వర్, నాగేశ్వరరావు, లాలయ్య, ఉపేందర్, పాండు, సత్యం, అబ్బాస్, సుబాని, షరీఫ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# కిరణ్మయిని అభినందించిన ఉప ముఖ్యమంత్రి భట్టి

ప్రజాపక్షం/ రఘునాథపాలెం : జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలకు ఎంపికైన మరికంటి కిరణ్మయిని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అభినందించారు. బుధవారం ఖమ్మంలోని క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ను కిరణ్మయి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కిరణ్మ



యిని ఉప ముఖ్యమంత్రి అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించాలని ఆకాంక్షించారు. మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న మరికంటి సైదులు ఆదిలక్ష్మి దంపతుల కుమార్తె మరికంటి కిరణ్మయి ఇంటర్ రెండవ సంవత్సరం ఖమ్మంలో చదువుతుంది. జిల్లా, రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభకనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. వచ్చే నెలలో మణిపూర్ రాష్ట్రంలో జరిగే జాతీయ స్థాయి ఫుట్ బాల్ పోటీలో తెలంగాణ రాష్ట్ర జట్టు తరుపున కిరణ్మయి ఆడనుంది. కిరణ్మయికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తామని ఉప ముఖ్యమంత్రి తెలిపినట్లు తండ్రి సైదులు తెలిపారు.

# విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి

## తనికెళ్ల గురుకులాన్ని ఆకస్మికంగా పరిశీలించిన డిప్యూటిసిఎం భట్టి







**ప్రజాపక్షం/కొణిజర్ల :** ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టిసారించిందని ఇందుకు గాను ఈ రంగాల్లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెడుతోందని డిప్యూటిసిఎం భట్టి విక్రమార్క అన్నారు. మండల పరిదిలోని తనికెళ్లలో గల గిరిజన బాలికల గురుకుల కళాశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఖమ్మం కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం ముగించుకొని మధిర నియోజకవర్గ పర్యటనకు వెళుతు ఆకస్మికంగా తనికెళ్లలోని తెలంగాణా గిరిజన సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలోకి ఆకస్మికంగా పర్యటించారు. తొలుత భవనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, ప్రిన్సిపాల్‌తో మాట్లాడారు. విద్యార్థుల సంఖ్య, మెనూ పాటిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. మెనూ చార్జ్‌షీట్‌ను పరిశీలించారు. ఈరోజు మెనూ ఏంటని అడిగి వంటలను పరిశీలించారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థినులు ప్రస్తుతం ఏఏరంగాల్లో ఎంతమంది స్థిరపడ్డారు అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. గ్రూప్ వన్, గ్రూప్ టు వంటి పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నాఅని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినిలతో కలిసి భోజనం చేశారు. విద్యార్థినులు దోమలు రాకుండా సువాసనలు వెదజల్లే అగరవత్తులను పరిశీలించారు. విద్యార్థినులు తయారుచేసిన బ్రాండింగ్ అగరవత్తులను మార్కెట్‌లో విక్రయించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్ ను ఆదేశించారు. విద్యార్థినులకు హెల్త్ కార్డులు ఉన్నాయా అని ప్రశ్నించగా విద్యార్థినులు హెల్త్ యాప్‌ను డిప్యూటిసిఎంకు వివరించారు. ఈకార్యక్రమంలో వైరా నియోజకవర్గ శాసనసభ్యులు మాళోత్ రాందాస్‌నాయక్, తనికెళ్ల గ్రామసర్పంచ్ గడల కళావతి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఐటిడిఏ పిఓ రాహుల్ , విద్యార్థినులు, ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

# ఘనంగా బ్లూమింగ్ మైండ్స్ 15వ వార్షికోత్సవం







**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని బల్లేపల్లిలో గల బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్ స్కూల్, జూనియర్ కళాశాల 15వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అంతర్జాతీయ టెన్నీస్ క్రీడాకారిణి, చిన్న వయస్సులోనే డాక్టరేట్ పొందిన నైనా జైస్వాల్, గౌరవ అతిథులుగా ఖమ్మం విద్యాశాఖాధికారిణి చైతన్య జైని, ఐబిటి బెటాలియన్ ఎన్‌సిసి ఆఫీసర్ కల్నల్ ఎస్‌కె భద్ర, బెటాలియన్ ఐఎన్‌సిసి కల్నల్ నవీన్ యాదవ్, ప్రత్యేక అతిథులుగా ప్రముఖ వైద్యులు గౌతమ్ యాలముడి, రాధికారాణి కందుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి నైనా జైస్వాల్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే అన్ని రంగాలలో రాణించాలన్నారు. విద్యతో పాటు తమకు అభిరుచి ఉన్న రంగాన్ని ఎంచుకోవాలన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు బానిసలు కావద్దని తెలిపారు. మారుతున్న సాంకేతికతను సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలన్నారు. బ్లూమింగ్ మైండ్స్ పాఠశాలలో అందిస్తున్న విద్యాబోధన అభినందనీయమన్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమలు నిర్వహించారు. వివిధ విభాగాల్లో ఆటల పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఛైర్మన్ భీమిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, కరస్పాండెంట్ అశోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# కొలువుదీరిన చేగొమ్మ పంచాయతీ పాలకవర్గం

## -ప్రజా సేవలో సర్పంచ్ బత్తుల వీరస్వామి





**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని చేగొమ్మ గ్రామ సర్పంచ్ పదవి ప్రమాణ స్వీకారోత్సవం అనంతరం కొలువుదీరిన పంచాయితీ పాలకవర్గం ప్రజాసేవలో నిమగ్నమయ్యారు. గ్రామ సర్పంచ్ బత్తుల వీరస్వామి బుధవారం నాడు పశువులకు నట్టల మందు వేయించే కార్యక్రమంలో పాల్గొని ప్రజా సేవలో నిరకవహిస్తున్నాడు. చేగొమ్మ గ్రామ సర్పంచ్ ఎన్నికలలలో ఇరువురు అభ్యర్థులకు సమానమైన ఓటింగ్ రావడంతో ఎన్నిక జరిగిన రోజు అర్ధరాత్రి వరకు ఉత్కంఠత ఏర్పడింది. ఈ క్రమంలో అధికార పక్షానికి చెందినవారు ప్రభుత్వ అధికారులపై బెదిరింపులు చేసిన పరిస్థితి నెలకొన్నప్పటికీ ఎన్నికల అధికారి పారదర్శకంగా ఎన్నికను నిర్వహించి ఏ పార్టీల వైపు కొమ్ముకాయ కుండా నిజాయితీగా ఉన్నది ఉన్నట్లుగా ఇరువురి అభ్యర్థుల సమక్షంలో టాస్ వేసి సర్పంచి ఎన్నికను నిర్ణయించడంతో ఇద్దరు అభ్యర్థుల్లో బత్తుల వీరస్వామి అనే వ్యక్తికి సర్పంచి పదవి వరించింది. ఆర్‌ఓ వెంటనే అతనికి నియామక పత్రాన్ని అందించడంతో సర్పంచ్ పదవికి ఎన్నికకు తెరదించారు. ఈ నేపథ్యంలో గ్రామంలో డిసెంబర్ 22న గ్రామ సర్పంచ్ పదవి ప్రమాణ స్వీకారోత్సవంను ప్రభుత్వ అధికారులు ముందుగా నిర్ణయించిన బత్తుల వీరస్వామికే ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్రామ సర్పంచి పదవి ప్రమాణస్వీకారోత్సవాన్ని చేయించడంతో చేగొమ్మ గ్రామ సర్పంచ్ ప్రమాణ స్వీకారోత్సవం సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్, వార్డు సభ్యులందరికీ అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు. ఈసందర్భంగా గ్రామంలో అనేక మంది ప్రజలు పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. రెండు రోజుల్లోనే సర్పంచ్ బత్తుల వీరస్వామి ప్రజా సేవలో భాగంగా గ్రామంలోని వీధిలైట్లు ఏర్పాటు పశువులకు నట్టల మందును వేయించడం గ్రామంలో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు నిర్వహిస్తున్న తీరు పువ్వు పుట్టగానే పరిమళిస్తుందనే చందంగా గ్రామ ప్రజలను తన పని విధానం ఆకట్టుకోవడంతో ప్రజలు గ్రామ సర్పంచ్ పనులను హర్షిస్తున్నారు.

# స్మార్ట్‌కిడ్జ్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం పాఠశాలలో నిర్వహించిన ఉత్సవాలలో భాగంగా పశువుల పాక సెట్టింగ్ ఏర్పాటు చేసి ఏసుప్రభు రాకను దేవదూతలు తెలియజేసే సన్నివేశాలను చిన్నారులు ప్రదర్శించారు. ఏసుప్రభు, మేరీమాత వేషధారణలతో క్రీస్తు జనన వేడుకను సంబురంగా నిర్వహించారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య మాట్లాడుతూ ఏసు జననం లోకానికి పర్వదినమని తెలిపారు. ఏసుప్రభు అందించిన బోధనలు కరుణ, శాంతిని అందరూ అలవర్చుకోవాలన్నారు. తమ పాఠశాలలో అన్ని పర్వదినాల వేడుకలను నిర్వహించడం ద్వారా మత ధర్మాలు, సాంప్రదాయాలను విద్యార్థులు తెలుసుకునే అవకాశం కలుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య తదితరులు పాల్గొన్నారు.

# యూరియా కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/చింతకాని :** నాగులవంచ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల సౌలభ్యం కోసం రేపల్లెవాడ గ్రామంలో యూరియా పంపిణీ కేంద్రాన్ని గ్రామ సర్పంచ్ మడిపల్లి అంబిక బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అంబిక మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని రైతుల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతుందని పేర్కొన్నారు. రైతులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం మాజీ అధ్యక్షులు నల్లమోతు శేషగిరి, వార్డు సభ్యులు, రైతులు మడిపల్లి నాగేశ్వరరావు, చిన్న భాస్కర్ పాల్గొన్నారు.

# బస్వాపురం అభివృద్ధికి సహకరించండి



**ప్రజాపక్షం/చింతకాని :** బస్వాపురం అభివృద్ధికి సహకరించి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అధికారుల భాగస్వామ్యం కావాలని నూతన సర్పంచ్ ఆవుల నర్సింహారావు అధికారులను కోరారు. నూతన సర్పంచ్‌గా భాధ్యతలు స్వీకరించిన నర్సింహారావు బుధవారం మండల కేంద్రంలో ఎంపీడీవో చుంచు శ్రీనివాసరావు, తహసీల్దార్ బాబ్జిప్రసాద్ , ఎస్సై వీరేందర్ , ఐకేపీ ఏపిఎం నాగపుల్లారావు , విద్యుత్ ఏఈ చావా శ్రీధర్, మండల వైద్యాధికారి డాక్టర్ ఆల్తాఫ్‌లను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింహారావు మాట్లాడుతూ అధికారుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని గ్రామంలో సమస్యల సాధనకోసం అధికారులు తనకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ చంద్రకాని నర్సింహారావు, గ్రామ పెద్దలు రాసాల మోహన్‌రావు, మార్గం శ్రీను, బద్దల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# మధిరలో గాయత్రీ బ్యాంక్ ప్రారంభం



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన గాయత్రీ కో ఆపరేటీవ్ అర్బన్ బ్యాంక్ 69వ శాఖను ప్రముఖ పారిశ్రామికవేత్త కోన జనార్ధన్ చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. పట్టణ ప్రముఖులు రంగా హన్మంతరావు, వైద్యులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, బ్యాంక్ ముఖ్య నిర్వాహణాధికారి వనమాల శ్రీనివాస్ పాల్గొని వివిధ భాగాలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ జగిత్యాల కేంద్రంగా 2000 సంవత్సరంలో యూనిట్ బ్యాంక్‌గా ప్రారంభించబడి గాయత్రీ బ్యాంక్ వినియోగదారులకు పారదర్శక సత్వర సేవలందించాలనే ఉద్ధేశ్యంతో కృషి చేస్తూ నేడ మల్టిస్టేట్ బ్యాంక్‌గా దినాదినాభివృద్ధి చెంది కోట్ల రూపాయల వ్యాపారాన్ని సాధించి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా 68బ్రాంబీలతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మధిర పట్టణ ప్రజలు గ్రాయతీ బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు, సహకార అధికారులు, బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్‌లో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**ప్రజాపక్షం/ మధిర :** మధిర పట్టణంలోని శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ నందు సెమి కిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ టైటాన్, స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ బి.అంజన్‌బాబు, ముఖ్యఅతిధిగా హాజరై విద్యార్థులకు క్రిస్మస్ పండుగ గొప్పతనం వివరిస్తూ ఏసు చూపించిన మార్గమైన కరుణ, దయ, శాంతి మార్గంలో ప్రతిఒక్కరూ నడవాలని తెలిపారు. అనంతరం క్రిస్మస్ కేక్ కటింగ్ చేసి స్విట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ చందు, వైస్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి వాసికి అరుదైన గౌరవం



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాద్రి వాసికి అరుదైన గౌరవం దక్కింది. పట్టణానికి చెందిన న్యాయవాది పామరాజు తిరుమల రావుకు ఫిబ్రవరి రెండో వారంలో విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో ఫోరం ఆఫ్ ఎన్విరాన్మెంట్ సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న సెమినార్‌లో ప్రసంగించేందుకు అవకాశం దక్కింది. ఇందుకు సంబందించి తిరుమలరావుకు ఆ సంస్థ చైర్మన్ డా.సిహెచ్ హనుమంతరావు ఆహ్వానం పంపించారు. గ్రీన్ భద్రాద్రి కో ఆర్డినేటర్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న తిరుమల రావు పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేస్తున్నారు. స్థానిక వాసికి అరుదైన అవకాశం దక్కడంతో ఎంఎల్‌ఏ డా.తెల్లం వెంకట్రావు, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొందెం వీరయ్య, పాకాల దుర్గాప్రసాద్, జిఎస్ శంకర్ రావు, గోళ్ల భూపతిరావు, సోమరౌతు శ్రీనివాసరావుతో పాటు తదితరులు అభినందించారు.

## జనతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రగ్గుల పంపిణీ



**ప్రజాపక్షం/పాల్వంచ :** సామాజిక బాధ్యతగా ప్రతీ ఒక్కరు తముకు ఉన్నంతలో ఇతరులకు సహాయం చేయాలని జనతా ఫౌండేషన్ అధ్యక్షురాలు బేర లక్ష్మి అన్నారు. పాల్వంచ బంగారుజాల గ్రామంలో జనతా ఫౌడేషన్ ఆధ్వర్యంలో సోమవారం వృద్ధులకు రగ్గులు పంపిణి చేశారు. అనంతరం జిఎస్ఎస్ నాయకులు ఆరెం ప్రశాంత్ మాట్లాడుతూ అంతరించి పోతున్న సాంప్రదాయ కళలైన కోలాటం, నృత్యాలలో ఉచిత శిక్షణ ఇస్తూ జీవం పోస్తున్న ఫౌండేషన్ భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నజియా, లావణ్య, మల్లేష్, శెట్టిపల్లి సర్పంచ్ కొర్ల వీరబాబు, సోడె మధు తదితరులు పాల్గొన్నారు.

## హ్యాపీకిడ్స్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల సెయింట్ జోసెఫ్ స్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. అలాగే క్రిస్మస్ తాతయ్య వేషాదారణలో అలరించారు. అంతేకాకుండా చిన్నారులు చేసిన నృత్యాలు, నాటికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్ఐ ప్రసాద్‌ను సన్మానించిన సిపిఐ నేతలు



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** తెలంగాణ స్టేట్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఖమ్మంరూరల్ ఆర్ఐ ప్రసాద్‌ను ఏదులాపురంమున్సిపాలిటీ సిపిఐ ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ఈ మేరకు ఆయనను రెవెన్యూ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ నాయకులు దండి రంగారావు, దండి రమేష్ దండి రవి, ఏఐవైఎఫ్ నాయకులు మిరియాల నరుణ్‌తేజ్, పొన్నం ఉమేష్, చింతల ఉదయ్, చింతల బన్నీ, సిపిఐ సోషల్ మీడియా ఇంచార్జ్ రెబ్బగొండ్ల గోపి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి రావాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ములకలపల్లి మండల కమలాపురం గ్రామంలో జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ ఛాంపియన్‌షిప్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలను జిల్లా క్రీడల అధికారి ఎం పరంధామరెడ్డి ఒలింపిక్ జెండాను ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభావంతమైన క్రీడాకారులు ఉన్నారని అన్నారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యతగా జిల్లా స్థాయి పోటీలను నిర్వహించడం ద్వారా గ్రామీణ స్థాయి క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించవచ్చని తెలిపారు. ఇలా చేస్తే జిల్లా స్థాయి క్రీడాకారులు వెలుగులోకి వచ్చి, భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో రాణించే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. కమలాపురం వంటి గ్రామంలో జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ పోటీలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. జిల్లాలోని నలుమూలల నుండి సుమారు 200 మంది అథ్లెట్లు పాల్గొనడం ఎంతో సంతృప్తిని కలిగించిందని తెలిపారు. ఈ విధంగా గ్రామీణ క్రీడాకారులు మరింతగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్‌ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి కే మహేందర్, జిల్లా అథ్లెటిక్స్ కోచ్ పి నాగేంద్ర పర్యవేక్షణలో పీడీ శ్వేత, అథ్లెటిక్స్ కోచ్‌లు నాగరాజు, ఎర్రయ్య, ఎండ్ అక్బర్, రాణి, కోటి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.

# ఆకాశాన్నంటిన గుడ్డు ధర..!

**పండుగల వేళ సామాన్యుడి జేబుకి పెద్ద కన్నం**

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల పరిధిలోని మార్కెట్ లో కూరగాయల ధరలు చూస్తే గుండె గుభేలు మంటోంది. పోనీ, నాలుగు గుడ్లతో సరిపెట్టుకుందామంటే అవీ కొండెక్కి కూర్చున్నాయి. ఇదీ ప్రస్తుతం జూలూరుపాడు మండల వ్యాప్తంగా సామాన్యుడి ఆవేదన. సామాన్య ప్రజల పౌష్టికాహారంలో ప్రధాన స్థానం దక్కించుకున్న కోడిగుడ్డు ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. ఎప్పుడూ అందుబాటులో ఉండే ఈ ఆహార పదార్థం ఇప్పుడు వినియోగదారులకు భారంగా మారింది. గతంలో రిటైల్ మార్కెట్లో ఒక్క గుడ్డు ధర రూ.5 నుంచి రూ.6 మధ్యే ఉండేది. అయితే, ప్రస్తుతం అదే గుడ్డు రూ.8 వరకు చేరడంతో మధ్యతరగతి కుటుంబాలు బెంబేలెత్తుతున్నాయి. మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, హోల్‌సేల్ మార్కెట్లోనే గుడ్డు ధర రూ.7.30 పైగా పలుకుతోంది. ఇప్పటికే టమాటా, ఉల్లి ధరలతో సతమతమవుతున్న మధ్య తరగతి ప్రజలకు, గుడ్డు ధర రూ. 8 కు చేరుకుంది. సాధారణంగా కార్తీక మాసంలో గుడ్ల వినియోగం తగ్గుముఖం పడుతుంది. డిమాండ్ తగ్గినప్పుడు ధరలు దిగిరావడం మార్కెట్ సూత్రం. కానీ, ప్రస్తుత పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది.

**పండుగల వేళ సామాన్యులకు షాక్...**

ఒకవైపు గుడ్లు, మరోవైపు చికెన్ వీటి ధరలు సామాన్యులకు అందనంత ఎత్తులోకి వెళ్తున్నాయి. పండుగల సమయంలో సామాన్యుల జేబుకు చిల్లులు తప్పడం లేదు. సామాన్యులకు తక్కవ ధరలో అందుబాటులో ఉంటే వీటి ధరలు పెరగడం నాన్‌వెజ్ ప్రియులకు ఇది బ్యాడ్‌న్యూస్ అనే చెప్పవచ్చు. ఇప్పటికే కోడి గుడ్ల ధరలు పెరుగుతోండగా. దానితో పాటు చికెన్ ధరలు కూడా భగ్గుమంటున్నాయి. త్వరలో క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతి లాంటి ప్రధాన పండుగలు వస్తుండటంతో వివిధ ప్రాంతాలకు కోళ్ల సరఫరా పెరిగిపోయింది. దీంతో డిమాండ్ కారణంగా చికెన్ ధరలు పెరిగిపోతున్నాయి. దాణా ఖర్చులు పెరుగడంతో కోళ్ల ఫామ్స్ నిర్వహణ కూడా యజమానులకు కష్టంగా మారిపోయింది. దీంతో ధరల పెరుగుదలకు ఇది కూడా ఒక కారణంగా చెబుతున్నారు. గుడ్లు, చికెన్ ధరలు పెరగడంతో సామాన్య,



మధ్యతరగతి ప్రజల ఇంటి ఖర్చు పెరుగుతోంది. దీంతో పండుగ వేళ సామాన్యులకు భారం తప్పడం లేదు. మరికొన్ని రోజుల పాటు ధరలు ఇలాగే కొనసాగే అవకాశముందని తెలుస్తోంది.

**సామాన్యుడు విలవిల...**

ఆదివారం వచ్చిందంటే చాలు. నాన్ వెజ్ ప్రియులు మాంసాహారంపై దృష్టి సారిస్తారు. చేపలు, చికెన్, మటన్ ఆరగించేందుకు సిద్ధమవుతుంటారు. వారి వారి ఆర్థిక పరిస్థితులను బట్టి ఫిష్, చికెన్ లేదా మటన్ తెచ్చుకుని తింటుంటారు. ఇక వాటికి కూడా డబ్బు పెట్టలేని సామాన్యులు కోడి గుడ్ల వైపు మొగ్గు చూపుతారు. కానీ ఇప్పుడు కోడి గుడ్డును కూడా కొనలేని పరిస్థితి ఏర్పడింది. కోడి గుడ్ల ధరలు కొండెక్కాయి. దీంతో సామాన్యుడు కూడా కోడి గుడ్డును కొందామంటే భయపడే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో డజన్ (12) కోడి గుడ్ల ధర రూ. 96 గా ఉంది. ఒక్కో గుడ్డు అయితే రూ. 8.కు విక్రయిస్తున్నారు. గత ఏడాది కాలం నుంచి డజన్ కోడి గుడ్ల ధర రూ. 65 నుంచి రూ. 70 మధ్య ఉంది. కానీ ఈ పది రోజుల్లోనే డజన్ గుడ్ల ధర రూ. 96 కి చేరడంతో సామాన్యుడు విలవిలలాడిపోతున్నాడు. అయితే కోడి గుడ్ల ధరల పెరుగుదలకు ప్రధాన కారణం. వినియోగంతో పాటు దానా ధరలు పెరగడమే అని వ్యాపారులు చెబుతున్నారు.

## ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

**-ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ**

**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బెండలపాడు గ్రామ శివారులో సీతారామ ప్రాజెక్ట్ కాలువ నుండి పంట కాలువలకు భూమి పూజ ఆయన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని అన్నారు. దానిలో భాగంగా ప్రతి ఎకరాకు నీరు అందించే లక్ష్యంగా పని చేస్తున్నామని, అశ్వారావుపేట నియోజకవర్గంలో పంట కాలువల ద్వారా 1,11480 ఎకరాకు నీరు అందించే విధంగా పనులు చేపడుతున్నామన్నారు. ఈ ప్రాజెక్ట్ కింద భూరాయికట్టు, చంద్రుగొండ, మద్దుకూరు, రావికంపాడు, గుర్రాయిగూడెం పంచాయితీ పరిధిలో 2946 ఎకరాలకు పంటకాల ద్వారా నీరు అందుతుందన్నారు. దీంతో 1172 ఎకరాలు ఆయకట్టుకు నీరు అందుతుందన్నారు. మన మండలం నుండి సీతారామప్రాజెక్ట్ కాలువ పోతుందని కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే ఆ నీళ్ల రైతుల పొలాలకు అందదని ప్రజలకు తప్పుడు సమాచారం తెలిపిన బిఆర్ఎస్ నాయకులు ఇప్పుడు కళ్ళు తెరవాలన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్యానాయక్, ఫజల్ బక్ష, బోగినబోయిన కోటేశ్వరరావు, సర్పంచులు బొర్రా లలిత, ఇస్లావత్ రుక్మిణి, కుంజా వెంకటేశ్వర్లు, బుంగ శ్రీనివాసరావు, ఇమ్రాన్, సంక శంకర్, బదుగు కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.



## అడవిలో అగ్గిపడితే అనర్థాలపై అవగాహన

**-చింతలతండా గ్రామంలో అవగాహన**
**-ముఖ్య అతిగా పాల్గొన్న ఎఫ్‌డిఓ కోటేశ్వరరావు**

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండలపరిధిలోని చింతలతండా గ్రామంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో బుధవారం అడవిలో నిప్పు నివారణ, అడవులు, వన్యప్రాణుల సంరక్షణ, అటవీ అభివృద్ధి పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కొత్తగూడెం ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసర్ కోటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ అడవుల అభివృద్ధి, సంరక్షణే ధ్యేయంగా కృషి చేస్తున్నామని, అటవీ సంపద, వనరులు, వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యతగా భావించాలని అడవుల్లో అడవి జంతువుల సంఖ్య పెరుగుతోందని రానున్న రోజుల్లో వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. వేసవి సీజన్ రానున్నందున ఈ వేసవి సీజన్లో అడవిలో అగ్నిపడితే జరిగే అనర్థాలు, నష్టాలు గురించి అవగాహన కల్పించారు. అడవిలో అగ్ని పడడానికి కారణాలు. అడవికి దగ్గరలో ఉన్న రైతులు పంట వ్యర్థలను అడవికి నిప్పు చేరకుండా చూడాలని, అడవికి వెళ్లేవారు అగ్గిపెట్టె తీసుకెళ్లకుండా, మరియు పశువుల కాపరులు బీడీలు కాల్చి అడవిలో పడేసి నిప్పుకి కారకులు కావొద్దని, గుట్ట ముసలమ్మ దేవుడి గుడి మరియు ఇతర వన భోజనాలకు వెళ్ళే వారు వంటలు వండిన తరువాత నిప్పు పూర్తిగా ఆర్పీ రావాలని, అడవికి నిప్పు పడకుండా అందరూ బాధ్యతగా కాపాడాలని, అనుకోకుండా ఎక్కడ అయిన నిప్పు పడినచో ఫారెస్ట్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలని, అడవిలో ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా గ్రామస్తులు సహకరించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చింతల తండా సర్పంచ్, ధర్మసోత్ పద్మ కరివారిగూడెం సర్పంచ్, బోడ దుర్గా భీమారావు, సింగభూపాలెం సర్పంచ్ కిన్నెర వెంకన్న, ఎఫ్ఆర్ఓ , ఎఫ్ఎస్ఓ శ్రీను, ఎఫ్ఓ బి. పవన్ కుమార్, ఎఫ్ఎస్ఓ హాతీరాం, ఎఫ్బీఓ రామ్మూర్తి, సింగభూపాలెం, చింతల తండా, లైన్ తండా గ్రామ ప్రజలు హాజరయ్యారు.



# ముస్తాబైన చర్చీలు..!

**నేడు క్రిస్మస్ పర్వదినం**





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** క్రైస్తవుల ఆరాధ్య దైవం ఏసుక్రీస్తు జన్మదిన నేడు. ఈ వేడుకను వైభవంగా జరిపించేందుకు ఆయా చర్చీలు ముస్తాబవుతున్నాయి. ఈ సందర్భంగా జిల్లాలోని పలు క్రైస్తవ దేవాలయాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. జిల్లా కేంద్రంలోని సిఎస్ఐ సెయింట్ ఆండ్రూస్ చర్చ్, భద్రాచలంలోని సిఎస్ఐ క్రీస్తు దేవాలయంతో పాటు జిల్లాలోని పలు డినామినేషన్లకు చెందిన అనేక క్రైస్తవ ఆలయాలు క్రిస్మస్ వేడుకకు ముస్తాబయ్యాయి. కొన్ని చర్చీల్లో 24వ తేది రాత్రి నుండే ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభిస్తారు. మరి కొన్ని చర్చీల్లో 25వ తేది క్రిస్మస్‌ను పురస్కరించుకుని తెల్లవారు ఝామున 3 గం. నుండి ప్రార్థనలు మొదలవుతాయి. ఏసుక్రీస్తు తెల్లవారు ఝాము సమయంలో జన్మించారనే చారిత్రక ఆధారంతో ఈ వేడుకను వేకువజామున ఎక్కువగా జరుపుతుంటారు. ఆయా దేవాలయాల్లో ఏసు క్రీస్తు జన్మదిన వృత్తాంతాలను భక్తులకు అర్థమయ్యే రీతిలో వివరించేందుకు ఆలయ కమిటీలు ప్రత్యేక ప్రసంగికులను పిలిపిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ క్రిస్మస్ పండుగ కుల మతాలకు అతీతంగా జరుగుతుంది. ఏ పండుగకు జరగనంత వ్యాపారం ఒక్క క్రిస్మక్ పండుగ సందర్భంగా జరగడం ఇందుకు నిదర్శనం. క్రిస్మస్‌ను పురస్కరించుకుని చాలా కుటుంబాల వారు పేదలకు నూతన వస్త్రాలను బహుకరిస్తుంటారు. ఏసు క్రీస్తు చూపిన ప్రేమ,దయ, కరుణ వంటి గుణాలను కలిగి ఉండాలని, పేదలకు తోడ్పాటు అందించే మంచి మనస్సు ఉండాలనే ఉద్దేశ్యంతో, ఏసు చూపిన మార్గాన్ని అనుసరిస్తూ తోటివారికి సహకరిస్తుంటారు. క్రైస్తవులు పండుగ సందర్భంగా చేసిన పలు రకాల పిండి వంటలను తోటి వారికి అందించి సంతోషాన్ని వ్యక్తం చేస్తుంటారు. ఈ సందర్భంగా పలు క్రైస్తవ ఆలయాల్లో స్నేహపూర్వక ప్రేమావిందు భోజనాలు ఏర్పాటు చేసుకుంటారు.

## గిరిజన ఆచార వ్యవహారాల ప్రతిబింబం గిరిజన మ్యూజియం

**- కోమల హైస్కూల్ ప్రిన్సిపల్ పలివెల రవికుమార్**





**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టేలా, ఆచార వ్యవహారాలు, ఆలవాట్లు, కట్టుబాట్లు ప్రతీ ఒక్కరికీ అర్థమయ్యేలా పొందు పరిచిన గిరిజన మ్యూజియం ప్రతిబింబం వంటిందని కోమల హై స్కూల్ ప్రిన్సిపాల్స్ డా.బి ఝాన్సీరాణి, పలివెల రవికుమార్ అన్నారు. బుధవారం ఐటిడిఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియాన్ని కోమలస్కూల్, పాల్వంచలోని సాంఘీక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల బాలికలు, ఉపాధ్యాయులు, అధ్యాపక బృందం సందర్శించారు. ఈ సందర్భంగా గిరిజన మ్యూజియంలో పొందుపరిచిన ప్రతీ వస్తువును తీక్షణంగా పరిశీలించారు. పాతకాలపు వస్తువులను ఈ తరం పిల్లలు చూడటంతో ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం మ్యూజియంలో ఏర్పాటుచేసిన క్రీడా స్థలంలో ఆటలాడుకుంటూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఐటిడిఏ పిఓగా పనిచేస్తున్న రాహుల్ స్వయంగా కోయభాషను నేర్చుకుని తన దైన శైలిలో అంతరినీ ఆకట్టుకోవడం గమనార్హం అని, గిరిజన సంస్కృతి సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు నేటి తరం మర్చిపోకుండా వాటిని ఒకే వేదికలో పొందు పరిచడం అభినందనీయం అని పలువురు ప్రసంశించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రకృతి అందాలకు నెలవు శ్రీనివాసగిరి



**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ శ్రీనివాసకాలనీలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి పర్యాటక రంగానికి ప్రచారం కల్పించటానికి ఏరు కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ జితేష్‌వి. పాటిల్ పాల్వంచ శ్రీనివాసకాలనికి విచ్చేశారు. పాల్వంచ శ్రీనివాసకాలనీలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న శ్రీనివాసగిరి ప్రకృతి అందాలకు నెలవుగా ఉందన్నారు. 2025 ఏరు ఫెస్టివల్ లో భాగంగా బుధవారం పాల్వంచ శ్రీనివాసకాలనీలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయ గుట్టపైకి ట్రెకింగ్ చేశారు. ఈ సంధర్భంగా గుట్టపై నుండి పాల్వంచ పట్టణ దృశ్యాలను వీక్షించారు. స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యాటక ప్రాంతం అత్యంత సమీపంలో గల గుట్టపైకి కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి వచ్చి ప్రకృతి అందాల నడుమ ఉల్లాసంగా గడపడానికి అనువుగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ, డివైఎస్ఓ ఎం. పరంధామరెడ్డి, తహశీల్దార్‌లు దారా ప్రసాద్, భగవాన్‌రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ కళాశాల ప్రిన్సిపాల్ అనూరాధ, దేవాలయ బాధ్యులు కొత్త వెంకటేశ్వర్లు, లక్ష్మణ్, చైతన్య భార్గవ్, అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరి మహధర్, కోచ్‌నాగేంద్ర, ఆర్చరి కోచ్ కళ్యాణ్, రమేష్, విద్యార్థులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**- క్రీడలు మానసిక, శారీరక దృఢత్వాన్ని కలిగిస్తాయి...**

క్రీడలు మానసిన ఉల్లాసంతో పాటుగా శారీరక దృధత్వాన్ని కలిగిస్తాయని జిల్లా కలెక్టర్ జితేష్‌వి. పాటిల్ అన్నారు. నవభారత్‌లోని నవభారత్ పబ్లిక్ పాఠశాలలో 46వ, వార్షిక క్రీడా దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్, కవాతును తిలకించి గౌరవ వందనాన్ని స్వీకరించారు.అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిహెచ్. కాంతారావు, టి. సంతోష్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్‌వికే. ప్రసాద్, ఉపాద్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అనాధ పిల్లలకు దుస్తులు వితరణ

**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండలంలోని కొత్తపాలెం గ్రామం బిసి కాలనీ నందు కిండల్ రూరల్ వెల్ఫేర్ సొసైటీ వారి ఆధ్వర్యంలో బుధవారం అనాధ పిల్లలకు దుస్తుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షురాలు వి.అనూష మాట్లాడుతూ తమ సొసైటీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. పేద, అనాధ పిల్లలకు పుస్తకాలు, బట్టలు పంపిణీ చేసినట్లు తెలిపారు. పేద పిల్లలు వీటిని ఉపయోగించుకుని విద్యలో రాణించాలని అభిలాషించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కనకవల్లి, రమేష్, కృష్ణారెడ్డి, వార్డు సభ్యులు, సభ్యులు కొవ్వాల స్వరూప, గుండ్ల సునీత, గ్రామస్తులు మల్లెల శ్రీనివాసరావు, మున్నంగి అనీల్‌కుమార్ పాల్గొన్నారు.



## ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** వేపలగడ్డ గ్రామ పంచాయితీలో ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సర్పంచ్ బొల్లి నిరోషా తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో గత ఆరు నెలల నుండి గ్రామస్తులు అనునిత్యం ఉపయోగించే నీటి వసతికి సంబంధించిన మోటార్ పాడైపోవడంతో నాటి నుండి ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారని, తాను సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిగా గ్రామ ప్రజల నీటి సమస్యను పరిష్కరించడంపై తొలి అడుగు వేయడం జరిగిందన్నారు. తాగునీటి సమస్య పరిష్కారించడంలో స్థానికుల సహకారంతో మోటార్‌కు మరమ్మత్తులను చేపించి తాగునీటి సమస్యను పరిష్కరించామని తెలిపారు. ఈసందర్భంగా గ్రామస్తులు సర్పంచ్‌గా బాధ్యతలను స్వీకరించిన సర్పంచ్‌తో పాటు ఉపసర్పంచ్, వార్డు సభ్యులు అందరు సమిష్టి నిర్ణయంతో తాగునీటి సమస్యకు స్వస్తి పలికి, త్రాగునీరు అందించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపసర్పంచ్ బొర్రా రాములమ్మ, వార్డు సభ్యులు కుంజా పార్వతమ్మ, వర్సా రమణయ్య, వర్స వరలక్ష్మి, తాటి సరోజినీ, గ్రామ పెద్దలు వర్సా రాజు, తాటి రామారావు, కుంజా సమ్మయ్య, స్థానిక యువత, గ్రామ పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధిపై దృష్టి సారించిన సర్పంచ్ రుక్మిణి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ గ్రామ పంచాయితీలో అభివృద్ధిపై దృష్టి సారించినట్లు పంచాయితీ సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి అన్నారు. బుధవారం క్రిస్టమస్ పండుగను పురస్కరించుకొని కూడలిలో కాంతులు వెలగాలని దృష్టిలో ఉంచుకొని పంచాయితీ సిబ్బందితో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా కోతుల బెడద నివారించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. అశ్వారావుపేట ఎంఎల్‌ఏ జారే ఆదినారాయణ నిధుల ద్వారా పంచాయితీ అభివృద్ధి పథంలో నడిపిస్తానని అన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. పంచాయితీ పరిధిలో ఉన్న సమస్యలను ఆయా శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నానని తెలిపారు. ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు బుంగ శ్రీనివాసరావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఉమా నరేష్‌కి ఘనంగా సన్మానం



**ప్రజాపక్షం/కారేపల్లి:** మాదారం గ్రామ పంచాయితీ నూతన సర్పంచ్‌గా ఎన్నికైన అజ్మీర ఉమా నరేష్‌కి మాదారం మహిళా సంఘం, బాగం రూప నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు పెద్ద ఎత్తున మహిళలు వార్డు సభ్యులు ప్రజాప్రతినిధులు సన్మానం చేశారు. ఇంకా అజ్మీర ఉమా నరేష్ మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆశీస్సులు అందించారు.

## పేదలకు ఉపాధిని దూరం చేస్తున్న మోడీ



**ప్రజాపక్షం/కారేపల్లి:** కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పేదలకు ఉపాధీ దూరం చేస్తుందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు విమర్శించారు. ఉపాధి హామీ చట్టాన్ని పథకంగా మార్చటాన్ని నిరసిస్తూ మంగళవారం మాణిక్యారంలో ఉపాధి హామీ కూలీలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా వ్యకాస నేత నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్లమెంట్‌లో విపక్షాల నిరసనల మధ్యలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పేరు మార్చి వీబీ జిరామ్ జి బిల్లుగా బిజెపి ఆధ్వర్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఆమోదించడం పని పొందే రాజ్యాంగ హక్కును హరించడమే అవుతుందన్నారు. ఉపాధి హామీ గ్యారెంటీ చట్టం యధాతథంగా కొనసాగించాలని వ్యకాస రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చిందన్నారు. ఈ ఆందోళన పోరాటాలలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో వ్యకాస నాయకులు ఉపేందర్, రవి, నాగేశ్వరరావు, వీరబాబు, సైదులు, లక్ష్మి, ఉమావతి, సరస్వతి, పుల్లమ్మ, సుగుణమ్మ, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులులేని ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలో అనుమతులు లేకుండా నడుస్తున్న ఇటుక బట్టీలపై చర్యలు తీసుకోవాలని బిజెపి పార్టీ ఆధ్వర్యంలో తహశీల్దార్ పిల్లి రాంప్రసాద్‌కు వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నకిరికంటి వీరభద్రం, మండల అధ్యక్షుడు జాటోత్ మధు, జిల్లా నాయకులు సోమపల్లి శ్రీనివాస్, వేగినాటి రాంబాబు, నకిరికంటి సతీష్, భూక్య హీరాలాల్ తదితరులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల బకాయిలను ఏక మొత్తంగా చెల్లించాలి

**-ప్రభుత్వం స్పందించకపోతే దశల వారీ ఆందోళన**
**-ఖమ్మంలో పెన్షనర్ల దీక్షలను ప్రారంభించిన పరిశ పుల్లయ్య**
**-అధికారులకు వినతి**





**ప్రజాపక్షం/ ఖమ్మం :** తెలంగాణ రాష్ట్రంలో పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తుందని పెన్షనర్ల బకాయిలను ఏక మొత్తంగా తక్షణం చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు పరిశ పుల్లయ్య డిమాండ్ చేశారు. 20 మాసాలు గడిచినా బకాయిలను చెల్లించడంలో రాష్ట్ర ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తుందని పెన్షనర్ల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్న ఈ ప్రభుత్వంలో చలనం లేకపోవడం శోచనీయమన్నారు. బుధవారం పెన్షనర్ల బకాయిలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ సమీపంలోని ధర్నాచౌక్‌లో ఒక రోజు నిరాహార దీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. దీక్షా శిబిరాన్ని పరిశ పుల్లయ్య ప్రారంభించగా దీక్షలో పెద్ద సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ తమ సర్వీసు కాలంలో పొదుపు చేసుకున్న జిపిఎఫ్, జిఐఎస్, ఏపిజిఎల్ఐసి, సెలవు బత్యాన్ని ఇవ్వడంలో ప్రభుత్వం సాగదీత వైఖరిని అవలంభిస్తుందని 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ చేసిన ఏ ఒక్కరికి నేటి వరకు పూర్తి స్థాయిలో బకాయిలను చెల్లించలేదని ఆయన తెలిపారు. బకాయిలతో పాటు ఐదు డిఏలను కూడా విడుదల చేయాలని 2023 జూలై నుండి పిఆర్‌సి నివేదికను అమలు చేయాలని ఆయన తెలిపారు. పెన్షనర్లకు క్యాష్‌లెస్ వైద్యాన్ని అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో అందజేస్తామని చెప్పినా ప్రస్తుత పాలకులు వైద్యం విషయంలో నిర్లక్ష్య వైఖరిని అవలంభిస్తున్నారని తెలిపారు. తక్షణం అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో చెల్లుబాటు అయ్యేవిధంగా హెల్త్ కార్డులను అందజేయాలన్నారు. 398 వేతనంతో నియామకమైన ఉపాధ్యాయులకు వారు స్పెషల్ టీచర్‌గా పనిచేసిన కాలానికి నోషనల్ ఇంక్రిమెంట్స్ ఇవ్వాలని పుల్లయ్య కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాయల రవికుమార్, సంయుక్త అధ్యక్షులు కనపర్తి వెంకటేశ్వర్లు, ఊడుగు వెంకటేశ్వర్లు, కనపర్తి నాగ ప్రసాద్, జి.లక్ష్మి సుజాత, ఊడుగు సుధాకర్, రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు ఎస్. జయరాం, రామారావు, ఎ. సాగర్, ఈ. రామ కోటేశ్వరరావు, డి.లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాలపేట గ్రామంలో ఘనంగా బిఆర్ఎస్ విజయోత్సవ సభ

**- హాజరైన సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర**





**ప్రజాపక్షం/ తల్లాడ :** బాలపేట మాజీ సర్పంచ్, మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు ప్రధాన అనచరుడు కోసూరి వెంకటనర్సింహారావు నేతృత్వంలో బుధవారం బాలపేట గ్రామంలో బిఆర్ఎస్ పార్టీ విజయోత్సవ సభ ఘనంగా నిర్వహించారు. బాలపేట గ్రామ సర్పంచ్‌గా కోసూరి ధన లక్ష్మి ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో అఖండ విజయం సాధించిన సందర్భంగా ఆ గ్రామ బిఆర్ఎస్ శ్రేణులు కోలాట బృందాలు, డప్పునృత్యాలతో విజయోత్సవ ర్యాలీ అనంతరం సభను నిర్వహించారు.ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సండ్ర వెంకటవీరయ్య హాజరై ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన సర్పంచ్ అమరయ్యను, పాలకవర్గాన్ని సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తల్లాడ మాజీ ఎంపిపి బిఆర్ఎస్ పార్టీ తల్లాడ మండల నాయకులు దొడ్డ శ్రీనివాసరావు కోర్కె మేరకు ఈ గ్రామాన్ని ప్రత్యేక శ్రద్ధ తీసుకుని అనేక అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో కేసిఆర్ ఆశీస్సులతో జిల్లాలోనే ముందు వరుసలో ఉంచామని, ఈ గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో నడపాలన్న ఆకాంక్ష ఆలోచన నాలో ఎప్పుడూ ఉంటూనే ఉంటుందని, నూతనంగా ఎన్నికైన పాలకవర్గం సమన్వయంతో పనిచేస్తూ గ్రామాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివాసరావు, బిఆర్ఎస్ పార్టీ మండల వీరమోహన్‌రెడ్డి, ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ దుగ్గిదేవర వెంకట్‌లాల్, అన్నారుగూడెం సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, నాయకులు మువ్వ మురళీధర్‌రావు, వజ్రాల రామిరెడ్డి, బిసి నాయకులు కోడూరి వీరకృష్ణ, జివిఆర్, కోసూరి వెంకట నర్సింహారావు, దొడ్డ చిన్న శ్రీనివాసరావు, మారెళ్ల దేవందర్, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, పేరసాని నర్సింహారావు, పడాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# కల్లూరు మండలంలో కొలువుదీరిన నూతన సర్పంచులు







**ప్రజాపక్షం/కల్లూరు:** డిసెంబర్ 17వ తేదీన జరిగిన స్థానిక పంచాయతీ ఎన్నికలలో అధికంగా మహిళా సర్పంచులే విజేతలై బాధ్యతలు చే పట్టారు. పోటాపోటీగా జరిగిన ఎన్నికలలో పల్లె పాలనపై ముద్ర చూపేనా అంటూ గ్రామాల్లో చర్చలు కొన సాగుతున్నవి. సర్పంచులు పల్లెల్లో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ప్రజలకు అనుకూలమైన సేవలు అందిస్తామని మరికొందరు గ్రామాల్లో మౌలిక వసతులు మరో కొందరు మహిళా నేతలు గ్రామాన్ని సొంత ఇంటితో తయారు చేస్తామని తెలుపుతున్నారు. చంద్రు పట్ల కాటమనేని విజయలక్ష్మి, చిన్న కోరుకొండి బూదాటి గీత, కొర్లగూడెం మోదుగు నాగజ్యోతి, ముత్తారం శీలం కోటమ్మ, ముగ్గ వెంకటాపురం బేబీ స్వరాజ్యలక్ష్మి వడ్లమూడి, ఓబుల్ రావు బంజర్ మాలోత్ అనురాధ, పేరువంచ కీసర నిర్మల, పోచవరం కట్టా ధనమ్మ, రఘునాథ గూడెం కుక్క సుధారాణి , తెలగారం ఎల్లమందల విజయలక్ష్మి , వెన్నవల్లి ఖమ్మంపాటి లక్ష్మి , యజ్ఞ నారాయణపురం కంచ పోగు సుజాత, పెద్ద కోరుకొండి దేవరపు నాగమణిలు గ్రామాల్లో ప్రత్యేక శ్రద్ధ చూపి ప్రజల మన్నలను పొంది ఈ ఐదు సంవత్సరాల్లో అభివృద్ధిని చూపిస్తామని మహిళా సర్పంచి నేతలు తెలుపుతున్నారు. గ్రామాల్లో అందరి అభిప్రాయాలను అందరి సహకారాలతో రాజకీయ నాయకులతో గ్రామాల అభివృద్ధికి సహకరిస్తామని గ్రామాలను తీర్చిదిద్దుతామని తెలుపుతున్నారు. మండలంలో అత్యధికంగా మహిళా సర్పంచులు గెలిచి వారిదే పెత్తనంగా ఆమెదే పైచేయి గా ఉంటూ పాలనలో ముద్ర వేయునున్నట్లు మహిళా సర్పంచులు తెలుపుతున్నారు.

# పాత బస్టాండ్ సెంటర్ వద్ద ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**ప్రజాపక్షం/వైరా:** వైరాలోని స్థానిక పాత సెంటర్‌లో సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైరా మున్సిపాల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, జిల్లా కాంగ్రేస్ నాయకులు మిట్టపల్లి నాగి, ఆత్మ కమిటీ డైరెక్టర్ జాలాది రామకృష్ణ, ఏఎంసి డైరెక్టర్ రేచర్ల సత్యం, టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ మెంబర్ మచ్చా రామారావు, దేవిశెట్టి సైదులు, బండారు తిరుపతిరావు, దార్న వెంకటేశ్వర రావు, సుగ్గల శ్రీనివాసరావు, ఐలూరి మోహన్‌రెడ్డి, పట్టణ కాంగ్రేస్ నాయకులు సయ్యద్ అన్వర్, కొమ్మూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం సహాయనిధి నిరుపేదలకు ఓ వరం



**ప్రజాపక్షం/మధిర :** ఆసుపత్రుల్లో చికిత్స పొంది ఆర్థిక సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కృషితో ఆర్థిక సాయం అందించటం జరుగుతుందని, సిఎం సహాయ నిధి నిరుపేదలకు ఒక వరం లాంటిదని మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్ అన్నారు. బుధవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు మధిర పట్టణానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన రూ.5లక్షలు విలువ చేసే సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తోందని వైద్య పరంగా ఆపదలో ఉన్న వారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మిరియాల రమణగుప్తా, మండల బిసిసెల్ అధ్యక్షులు చిలువేరు బుచ్చిరామయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాణావత్ వెంకటరమణనాయక్, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్.జహంగీర్, యన్నం కోటేశ్వరరావు, కర్నాటి శ్రీను, మాగం ప్రసాద్ పాల్గొన్నారు.

# రెజొనెన్స్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం వేడుకల్లో భాగంగా క్రిస్మస్ కేక్ కట్ చేశారు. క్రిస్మస్ చెట్టు, నక్షత్ర కాంతులతో, ఏసుక్రీస్తు, దేవధారణలతో చిన్నారులు క్రీస్తు జన్మస్థలాన్ని తలపించేలా వేడుకలను నిర్వహించారు. పలు క్రిస్మస్ గేయాలు, నృత్యాలు, నాటకాలు ప్రదర్శించారు.ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు, కృష్ణవేణి లు మాట్లాడుతూ క్రిస్మస్ ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా ప్రపంచ వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారన్నారు. శాంతి, క్షమాగుణం, కరుణ వంటి సందేశాన్ని ఏసుక్రీస్తు అందించారని దానిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సర్వజ్ఞలో సెమీ క్రిస్మస్ వేడుకలు



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో గల సర్వజ్ఞ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో క్రిస్మస్ చెట్లు, రంగు రంగుల నక్షత్రాలతో అలంకరించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. శాంతి సందేశాత్మక నృత్యాలు, క్రిస్మస్ కీర్తనలు ప్రదర్శించారు. శాంటాక్లాజ్ వేషధారణలతో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఛైర్మన్ ఆర్‌వి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ మానవాళికి ప్రేమ, శాంతి, సహనం వంటి గొప్ప విలువలను నేర్పిందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ఇటువంటి సాంప్రదాయాలను, విశిష్టతలను తెలుసుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఉప ముఖ్యమంత్రిని కలిసిన వివిపాలెం సర్పంచ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉప ముఖ్యమంత్రి,ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్కను నూతనంగా ఎన్నికైన వి.వెంకటాయపాలెం సర్పంచ్ కాపా ఆదినారాయణ మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కాపా ఆదినారాయణ మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మూడు శంకర్, తగరం అదాం, నాయకులు కిలారు వెంకటరమణ, కిలారు అనిల్, కిలారు రాజేశ్వరరావు, జంగాల శ్రీను, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కోనేరు పునఃనిర్మాణానికి భూమి పూజ



**ప్రజాపక్షం/పెనుబల్లి:** పెనుబల్లి మండలం శ్రీ నీలాద్రి స్వామి వారి దేవాలయంలో బుధవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దంపతులచే కోనేరు పునర్నిర్మాణమునకు భూమిపూజ చేశారు. ఆలయ రి న్నోవేషన్ కమిటీ చైర్మన్ సభ్యులు, దేవాలయ కార్య నిర్వహణ అధికారి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి శాసనసభ్యులతో పాటు భక్తులు కూడా పాల్గొన్నారు. శ్రీ రాఘవ కన్స్ట్రక్షన్స్ కు చెందిన శ్రీ పొంగులేటి బ్రదర్స్ వారి స్వంత ఖర్చుతో భక్తుల సౌకర్యార్థం ఈ నిర్మాణం చేయుచున్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజబోయిన కోటేశ్వరరావు, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరావు, కరీముల్లా, దొంతు మాధవరావు పాల్గొన్నారు.

# మాణిక్యమ్మ మృతికి నివాళి



**ప్రజాపక్షం/ తల్లాడ :** తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో గొడ్ల మాణిక్యమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. బుధవారం ఆమె దశదిన కార్యక్రమంలో వారి స్వగృహంలో నిర్వహించగా తల్లాడ మాజీ ఎంపిపి దొడ్డ శ్రీనివారావు హాజరై మాణిక్యమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాప సానుభూతిని తెలిపారు. ఆ గ్రామ సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు పేరసాని నర్సింహారావు, ఇస్నేపల్లి లోకయ్య తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

# యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం

## - జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలో యువతీ యువకులకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ఎల్ఎస్‌సి సహకారంతో స్కిల్ డవలెప్ మెంట్ ట్రైనింగ్ ప్లేస్ మెంట్ సపోర్టు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఈ సందర్భంగా ఐడిఓసి సమావేశ మందిరంలో కలెక్టర్ మాట్లాడుతూ హైదరాబాద్ లాజిస్టిక్ రంగంలో ఎల్ఎస్‌సి, కోల్టీ సంస్థల ద్వారా రియల్ టైమ్ ఫోర్క్‌లిస్ట్ లిఫ్ట్ ఆపరేటర్ సంప్రై చైన్ అసోసియేట్ ఎగుమతి దిగుమతులు కోర్సులు పూర్తి ఉచితంగా, శిక్షణతో పాటు అందించనున్నట్లు తెలిపారు శిక్షణకు ఎంపికైన వారికి ఉచిత బస, భోజన అందిస్తారని, శిక్షణ అనంతరం నెలకు రూ.13 వేల నుండి రూ.18వేల వరకు జీతంతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా 51 మంది హాజరుకాగా 29 మంది ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ విద్యాచందన, ఏపిఎం వెంకయ్య, ఇడిఎం సైదేశ్, సిహెచ్ నాగానంద్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు అవగాహన కల్పించాలి : డిఎస్‌పి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి నిత్యం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని డిఎస్‌పి రెహమాన్ అన్నారు. బుధవారం ఆయన కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను పరిశీలించారు. ముందుగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసే ఇబ్బంది కోసం ప్రక్కనే ఉన్న విశ్రాంతి గదులను ప్రారంభించి పలు సూచనలు చేశారు. పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని, రోడ్డు ప్రమాదాలు, సైబర్ నేరాలపై నిత్యం ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. డిసెంబర్ నెల చివరి వారంలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్




స్టేషన్‌లో పనిచేసే సిబ్బంది నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో అధికారులు, సిబ్బందితో కలిసి సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో 3 టౌన్ సిఐ శివ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# పాలకులతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలి

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** కొత్తగా ఎన్నికైన పాలకులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని నేలకొండపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి యం.యర్రయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయం లో, బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులతో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి కోసం నూతన సర్పంచ్లతో కలిసి ముందుకు సాగాలని సూచించారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని పేర్కోన్నారు. పంచాయతీ ఎన్నికలలో పోటీ చేసిన అభ్యర్థులు అంతా వ్యయ ఖర్చులు వివరాలు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో గెలిచిన వారి పదవి కోల్పోయే అవకాశం ఉందని అన్నారు. అదే విధంగా ఓడినఅభ్యర్థులు మూడేళ్ల పాటు పోటీ చేసే అవకాశం లేకుండా పోతుందని అన్నారు. మండలం లోని 300 వార్డులకు గాను పోటీ చేసిన 578 మంది అభ్యర్థులు, 32 గ్రామ పంచాయతీలకు గాను, 75 మంది సర్పంచ్ అభ్యర్థులు ఖర్చుల వివరాలు ఇవ్వాలని కోరారు. అవసరమైతే వారికి నోటీసులు ఇచ్చి వివరాలు తీసుకోవాలని ఆదేశించారు.




ఉపాధి హామీ పథకంలో మారిన కొత్త నిబంధనల పై అవగాహాన కలిగి ఉండాలని సూచించారు. కొత్తగా ఏర్పాటు చేసిన నర్సరీ లలో పనులు పూర్తి చేయాలని సూచించారు. ప్రతీ పంచాయతీ నూరు శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, ఈజీఎస్ ఏపీవో సునీత, ఈసీ శేషగిరి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

# ప్రమావశాత్తు విద్యార్థి మృతి



**ప్రజాపక్షం/కూసుమంచి:** మండలంలోని నాయకన్‌గూడెం చందన ప్రైవేటు పాఠశాలలో ప్రమాదవశాత్తు ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే మేడారపు విహార్(6) నాయకన్‌గూడెంలో చందనస్కూల్ నందు యూకేజీ చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో ఇంటర్వెల్ నందు ఆడుతూ ఉండగా ప్రమాదశశాత్తు కింద పడి తన జేబులో ఉన్న పెన్సిల్ ఛాతికి తగలడంతో తీవ్ర గాయాల పాలైన విహార్‌ను మెరుగైన వైద్యం కోసం ఖమ్మం హాస్పిటల్ తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయారు.

# బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురంలోని ఎస్‌కెటి ఫంక్షన్ హాల్ నందు బుధవారం బిఆర్ఎస్ కార్యకర్తల సమావేశం, పార్టీ సర్పంచుల అభినందనల సభ నిర్వహించారు. ఈసందర్భంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కోడి అమరేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముఖ్యఅతిథిగా బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ శాసన సభ్యులు రేగా కాంతారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీ మండల అధ్యక్షులు కృష్ణార్జున్ మాట్లాడుతూ మండలంలో బిఆర్ఎస్ పార్టీకి తిరుగులేదని, అధికార ప్రభుత్వం రాష్ట్ర నాయకులు పంచాయితీ ఎన్నికలలో తిరిగిన వారి పాచికలు పారలేదని, రాబోయే ఎంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని అన్నారు. అనంతరం సీనియర్ నాయకులు సూదిరెడ్డి గోపిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ఎన్ని ఒత్తిడి ఎదురైన ముందుకు దూసుకుని వెళ్తామని అన్నారు. అనంతరం బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మర్రి మల్లారెడ్డి మాట్లాడుతూ మండలంలో సర్పంచులు, ఉపసర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించుకోవడంతో బిఆర్ఎస్ పాత్ర మరువలేనిదని నాయకులు కార్యకర్తలు చాలా కష్టపడ్డారని వారికి తన తరపున ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ముఖ్యఅతిథిగా పాల్గొన్న రేగా మాట్లాడుతూ ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ మద్దతుతో పోటీ చేసిన సర్పంచ్‌లు ఘన విజయం సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేసి ప్రజలు బిఆర్ఎస్ పార్టీ పై తమ నమ్మకాన్ని చాటారని అన్నారు. అయినప్పటికీ ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా చాలా గ్రామాలలో పంచాయితీలలో సర్పంచులకు ఉపసర్పంచులకు వార్డు మెంబర్లకు బిఆర్ఎస్ అభ్యర్థులకే పట్టం కట్టారని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేసి ఎన్నికలను ప్రభావితం చేయాలని కాంగ్రెస్ పార్టీ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని రేగా కాంతారావు వ్యాఖ్యానించారు. ప్రజా స్వామ్య విలువలను కాపాడాల్సిన అధికారులు ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం దురదృష్టకరమని అన్నారు. భవిష్యత్తులోనూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, బిఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈకార్యక్రమం లో బిఆర్ఎస్ నాయకులు, నూతన సర్పంచులు పాల్గొన్నారు.

# పెన్షనర్ల బకాయిలు సత్వరం చెల్లించాలి

## -పాల్వంచలో పెన్షనర్ల దీక్ష జయప్రదం

## -ఎస్‌జిపిఏటి రాష్ట్ర నాయకులు పరిశ పుల్లయ్య





**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ చేసిన పెన్షనర్ల బకాయిలు సత్వరం చెల్లించాలని ఎస్‌జిపిఏటి రాష్ట్ర నాయకులు పరిశ పుల్లయ్య డిమాండ్ చేశారు. బుధవారం పాల్వంచ కలెక్టరేట్ వద్ద గల ధర్నాచౌక్‌లో నిరాహార దీక్ష శిబిరం పెన్షనర్ల జేఏసి జిల్లా నాయకులు గడ్డం ముత్యం అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పరిశ పుల్లయ్య మాట్లాడుతూ రానున్న కాలంలో పెన్షనర్లు ఉద్యమాలకు సంసిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యల పట్ల సవతితల్లి ప్రేమను కనబరుస్తుందని ఇప్పటికైనా పెన్షనర్ల సమస్యలను పరిష్కారం దిశగా పెన్షనర్ల బకాయిలను ఏక మొత్తంలో చెల్లించాలని ఆయన కోరారు. అనంతరం ప్రతినిధి బృందం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు బివి రమణమూర్తి, కనకదుర్గ, నర్సింహారావు, కృష్ణమూర్తి, స్వామి, ఎస్. శ్రీనివాసరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# నట్టల నివారణతో జీవాల్లో ఎదుగుదల



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నట్టల నివారణతో జీవాల్లో మంచి ఎదుగుదలతో పాటు ఆరోగ్యవంతమైన పశు సంపదను అభివృద్ధి చేసుకోవచ్చని చెరువుమాధారం పశు వైద్యాధికారి డాక్టర్ సాహిత్య అన్నారు. బుధవారం మండలంలోని భైరవునిపల్లి గ్రామం లో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం రైతులకు ఉచితంగా అందిస్తున్న నట్టల నివారణ మందుల పంపిణీని గ్రామ సర్పంచి గుండపనేని లక్ష్మణరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ సాహిత్య మాట్లాడుతూ పశు సంపద పట్ల రైతులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పశువులకు సంక్రమించే జబ్బులను ముందస్తుగా గుర్తించి తక్షణమే ఆసుపత్రికి తరలించి తగిన వైద్య చికిత్సలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ డాక్టర్ తాటి రామారావు, గొర్రెల మేకల పెంపకదారుల సంఘం గ్రామ అధ్యక్షుడు మల్లెబోయిన ఉపేందర్, మాజీ సర్పంచ్ కనకబండి సీతారాములు, మాజీ ఎంపీటీసీ నూక చిన్ననాగయ్య, గ్రామ పెద్దలు గొళ్ళ శ్రీనివాస్ రావు, మల్లెబోయిన శ్రీనివాస్ రావు, గండు సైదులు, గోపాలమిత్రులు వెనేపల్లి వేంకటేశ్వరరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమిలీలో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



**ప్రజాపక్షం/అశ్వాపురం:** అశ్వాపురంలోని ఎమిలీ పాఠశాలలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ములకలపల్లి గోపినాథ్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, సేవాభావానికి ప్రతీక అని ప్రపంచ మంతా చేసుకునే పండుగ క్రిస్మస్ అని తెలిపారు. విద్యార్థులు ఈ విలువలను తమ జీవితాల్లో పాటించాలని సూచించారు. కార్యక్రమం అనంతరం చివరిలో విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి వేడుకలను ఆనందంగా ముగించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయురాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ అంబేద్కర్ క్రికెట్ టోర్నమెంట్

**ప్రజాపక్షం/అశ్వాపురం :** క్రీడలు మానసిక ఉల్లాసానికి ఉత్సాహాన్ని ఆనందాన్ని ఇస్తాయని క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకోవాలని, ఆట ప్రధానమని గెలుపు ఓటమి సహజంగా వచ్చి పోయేవని మానసిక ధృఢత్వానికి ఆటలు చాలా ముఖ్యమని మాజీ ఎంపిపి ముత్తినేని సుజాత అన్నారు. అశ్వాపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో బిఆర్ అంబేద్కర్ 5వ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆమె పాల్గొని, టోర్నమెంట్ ప్రారంభించారు. సిఐ అశోక్‌రెడ్డి క్రీడలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకొని వారితో క్రీడాకారులను పరిచయం చేసుకొని వారితో క్రికెట్ ఆడటం జరిగింది. ఈకార్యక్రమంలో టోర్నమెంట్ నిర్వాహకులు, అమెర్ద సర్పంచ్ కొర్స కృష్ణ, ఎంపిడివో, యూడీసి పద్మావతి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఓరుగంటి భిక్షమయ్య, నాయకులు వేములపల్లి రమేష్, వలబోజు మురళీకృష్ణ, కిలారు శేషగిరి, టోర్నమెంట్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్పంచ్ హెమీయను సన్మానించిన జర్నలిస్టులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం విప్పలమడక సర్పంచ్‌గా విజయం సాధించిన జర్నలిస్టు మేడా సంపత్ సతీమణి మేడా హేమియా చక్రపాణి సంపత్‌ను మంగళవారం వైరాలోని పలువురు జర్నలిస్టులు సంపత్ నివాసం నందు కలిసి శుభాకాంక్షలు చెప్పడంతో పాటు సంపత్ హెమీయా చక్రపాణి దంపతులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు పారుపల్లి కృష్ణారావు, మేడా సూర్యప్రసాద్, సూతకాని ప్రేమ్‌చంద్, పులి కృష్ణార్జున్‌రావు, భూక్యా శ్రీనివాసరావు, మెరుగు కృష్ణ, సత్తెనపల్లి లక్ష్మాచారి, ఆది శ్రీకాంత్, చింతల వసంతరావు, సూతకాని శ్రీకాంత్, నల్లమోతు శ్రీను, ధర్మపురి రవితేజ, వెన్నపూస వీరారెడ్డి, గుండ్ల ప్రశాంత్, మామిళ్లపల్లి విజయ్, సూతకాని శ్రీకాంత్, రుద్రాక్ష చారి, మోదుగు వినోద్, పమ్మి రాజు, గొల్లమందల బాబు, సత్తెనపల్లి నర్సింహారావు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**- బోనకల్ మండలంలో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సిఎం భట్టి**



ప్రజాపక్షం/ బోనకల్ : తెలంగాణలోని గ్రామాలభివృద్ధే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. బుధవారం మధిర నియోజక వర్గ పరిధిలోని బోనకల్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. మండలంలోని ముష్టికుంట్ల నుంచి చిరునో ముల వరకు రూ.3.45కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధే లక్ష్యంగా రహ దారి సదుపాయాలు మెరుగుపడితే ప్రజల జీవన ప్రమాణాలు మరింత పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ రోడ్డు ద్వారా గ్రామాల మధ్య రాకపో కలు సులభమవుతూ వ్యవసాయం, వ్యాపారం, విద్య, వైద్యం వంటి రంగాలకు మరింత ఊతం లభిస్తుందని అన్నారు. ప్రజల అవసరాలు తీర్చటమే మా ప్రభుత్వానికి ప్రథమ ప్రాధాన్యత అని, గ్రామాలు అభి వృద్ధి చెందిన నాడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొండబాల కోటేశ్వరరావు, జిల్లా నేతలు, వివిధశాఖల అధి కారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బిఐటి కళాశాలలో ఎంసిఏ స్వాగత వేడుకలు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఎస్‌బిఐటి కళాశాలలో మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లి కేషన్స్ (ఎంసిఏ) మొదటి సంవత్సర విద్యార్థుల స్వాగత వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవర ణలో నిర్వహించిన వేడుకల్లో కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ పాల్గొని మాట్లా డుతూ ఎంసిఏ విద్యార్థులు ఇంజనీరిం గ్‌కు దీటుగా ఉద్యోగ అవకాశాలు పొంద తున్నారని తెలిపారు. విద్యార్థులు డిగ్రీ అర్హతతో పోటీ పరీక్షలు, ప్రభుత్వ ఉద్యోగాలను సైతం అందిపుచ్చుకోవచ్చునని ఆయన తెలి పారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. ధాత్రి మాట్లాడుతూ తమ కళాశాలలో పిజి కోర్సులైన ఎంబిఏ, ఎంసిఏ, ఎంటెక్ కోర్సులపై ప్రత్యేక శ్రద్ధవహించి శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. కోడింగ్, అప్టి ట్యూడ్ కోర్సుల్లో కూడా ప్రత్యేక శిక్షణ అందిస్తూ ప్రైవేటు, సాఫ్ట్‌వేర్ కంపెనీల ప్రవేశ పరీక్షలకు సిద్ధం చేస్తున్నా మని వైస్ చైర్మన్ శ్రీ చైతన్య తెలిపారు. ఇన్ఫో సిస్, కాగ్నిజెంట్ వంటి కంపెనీలకు సైతం తమ విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఆయన తెలిపారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లా డుతూ బిటెక్‌తో పాటు పిజి కోర్సులను అటా నమస్ హోదాలో నిర్వహిస్తున్నామని తెలి పారు. విద్యార్థులకు ఇంటర్న్ షిప్స్, వర్క్‌షా ప్స్‌ను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని తెలి పారు. ప్రతిబింబ్ పేరుతో నిర్వహించిన స్వాగత వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ క్రీడా పోటీల్లోని విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ డైరెక్టర్స్ గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, ఎంసిఏ విభాగాధిపతి ఎస్. నాగమణి, శ్రీలక్ష్మి తదిత రులు పాల్గొన్నారు.

# న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు





ప్రజాపక్షం/వైరా: వైరాలోని న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ వేడుకల్లో విద్యార్థు లు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నా రు. యేసుక్రీస్తు జన్మించినటువంటి పశువుల పాకను ఏర్పాటు చేసి బాలేసును అందులో కూర్చోండబె ట్టారు. సెమీ క్రిస్మస్ వేడుకల్లో భాగంగా విద్యార్థులు యేసుక్రీస్తును స్తుతించుచూ పాటలు పాడి నృత్యాలను ప్రదర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాంతాక్లాజ్ ప్రధాన ఆకర్షణగా నిలిచి విద్యార్థులకు బహుమతులను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల కర స్పాండెంట్ డాక్టర్ భూమేష్‌రావు, డైరెక్టర్ కుర్రా సుమన్ మాట్లాడుతూ మనం తెలిసి తెలియక చేసిన పాపాలను క్షమించడానికి ఈ భూమి మీద అవతరించిన శక పురుషుడు యేసుక్రీస్తు డిసెంబర్ 25 క్రీస్తు పుట్టి నరోజును పురస్కరించుకొని మనం క్రిస్మస్ పండుగను ఆనందంగా జరుపుకుంటున్నాం. క్రిస్మస్ పండుగ శాంతి, సంతోషం, త్యాగానికి ప్రతీకగా నిలుసుతదని, సాటి మనిషిపై దయ, కరుణ, జాలి కలిగి ఉంటూ మన జీవనాన్ని కొనసాగించాలని ఆయన బోధించిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ, ఏవో నర్సింహారావు, ఉపాధ్యాయుని, ఉపాధ్యా యులు, విద్యార్థిని, విద్యా ర్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రాములన్న రాజకీయాలకు ఎంట్రీ..?

**-కార్యకర్తలతో సమావేశాలు**
**-పూర్తిస్థాయిలో నియోజకవర్గ రాజకీయాల్లోనే ఉండేందుకు ప్రణాళిక?**



ప్రజాపక్షం/వైరా: వైరా మాజీ శాసనసభ్యులు లావుడ్యా రాములునాయక్ పూర్తిస్థాయి రాజకీయా ల్లోకి గత కొన్ని రోజులు విరామం తర్వాత అడుగుపె డుతున్నట్లు సమాచారం. గత శాసనసభ ఎన్నికల తర్వాత బిఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసిన మాజీ ఎమ్మెల్యే రాములునాయక్ గత రెండు సంవత్సరా లుగా రాజకీయ పార్టీలకు దూరంగా ఉంటూ నియో జకవర్గంలో అప్పుడప్పుడు పర్యటనలో పాల్గొంటూ ఉన్నారు. ప్రస్తుతం రాములన్న చూపు మరల వైరా నియోజకవర్గంపై పూర్తిస్థాయిలో కేటాయించినట్లు తెలుస్తుంది. రాజకీయాలకు అతీతంగా నియోజకవర్గంలో పర్యటనలు చేసేందుకు ప్రజల వద్దకు వెళ్లి ప్రజా సమస్యల పట్ల పోరాటం చేసేం దుకు రాములునాయక్ మరోసారి రాజకీయంలో పూర్తిస్థాయిలో ప్రజ లకు అందుబాటులో ఉండేవిధంగా ముందుకు సాగుతున్నట్లు తెలు స్తుంది. ఇప్పటికే వైరా నియోజకవర్గంలో ఐదు మండలాల్లోని తన సానుభూతిపరులతో చర్చలు జరుపుతూ ఉన్నట్లు సమాచారం. అయితే ఏ రాజకీయ పార్టీలో అనేది కాకుండా ప్రస్తుతం తన సొంత ఏజెండా తోనే రామున్న అనే ఇమేజ్‌తోనే నియోజకవర్గ రాజకీయాలపై ప్రత్యేక దృష్టి సాధించారు. వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలురుపాడు మండలాల్లో ఇప్పటికే రాములునాయక్ అనుచర బృందం ఉంది. 2026 నూతన సంవత్సరంతో పూర్తిస్థాయి రాజ కీయంలో రాములునాయక్ తన ముద్రను వేసుకున్నారు. మండలాల వారీగా ప్రతిరోజు గ్రామాలను ఎంచుకొని మరల ప్రజల మధ్యలోనే ఉండేందుకు రాములన్న సిద్ధమయ్యారు. రాములన్న రాకతో నియోజక వర్గంలో రాజకీయ పరిణామాలు ఏ విధంగా ఉంటాయో అనేది కూడా వేచిచూడాలి. ఎందుకంటే అధికార కాంగ్రెస్ పార్టీలో ఉన్న కాంగ్రెస్ నాయకుల్లో చాలామంది రాములునాయక్‌ను అత్యంత సన్నిహితంగానే ఉన్నారు. అయితే రాములునాయక్ పూర్తిస్థాయిలో నియోజకవర్గంలో రాజకీయాల్లో రీఎంట్రీ కావడంతో రాజకీయ పరిణామాలు ఏ విధంగా ఉండబోతాయో వేచిచూడాల్సిందే.

# భారీగా గంజాయి పట్టివేత



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఖమ్మం హైవేపై సుమారు కోటిరూపాయల విలువ చేసే గంజాయి పట్టు బడింది. అశ్వారావుపేట మండలం అచ్యుతాపురం వద్ద వాహన తనిఖీల్లో గంజాయి రవాణా చేస్తున్న డిసిఎం కంటైనర్‌ని పోలీసులు అదుపులోకి తీసుకు న్నారు. తమిళనాడు రిజిస్ట్రేషన్ కలిగిన ఓ డిసిఎం కంటైనర్ లోని క్యాబిన్ సీక్రెట్ లాకర్‌లో గంజాయిని గుర్తించిన పోలీసులు సుమారు రెండు వందల కేజీల గంజాయి ప్యాకెట్లను సీజ్ చేశారు. పట్టుబడిన గంజాయి బహిరంగ మార్కెట్‌లో రూ.98లక్షలు వరకు ఉంటుందని, వ్యాన్‌తో పాటు ఎస్కార్ట్‌గా వచ్చిన ఇన్నోవా కార్‌ని, నలుగురు వ్యక్తుల్ని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఒరిస్సాలో కొనుగోలు చేసిన గంజాయిని రహస్యంగా తమిళనాడు చెన్నైకి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు ప్రాథమికంగా వివరాలు తెలుస్తున్నాయి.

# ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు




ప్రజాపక్షం/ రఘునాథపాలెం : మండల పరిధి లోని పాపటపల్లి గ్రామంలో గల సెయింట్ జెవి యర్స్ పాఠశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం నిర్వహిం చిన వేడుకలను హెచ్‌ఎం సిస్టర్ రీనా, పాదర్ సుధాకర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. క్రిస్మస్ తాత, నృత్యాలతో విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ ఆటల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనం తరం క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సోలిపురం గ్రామాన్ని అభివృద్ధి చేసుకోండి



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : గ్రామాల్లో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల ముందు రాజకీయాలు చేయాలి తప్పా ఎన్నికలు అనంతరం గ్రామాభివృద్ధికి అందరూ కలిసి సమిష్టి కృషితో అభివృద్ధికి పాటుపడాలని తిరుమ లాయపాలెం ఎస్సై కూచిపూడి జగదీష్ అన్నారు. సోలిపురం గ్రామపంచాయతీ నూతన సర్పం చ్‌గా ఎన్నికైన నూనావత్ సమ్మక్క అశోక్ మాజీ సర్పంచ్ హలావత్ శ్రీను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో ఘనంగా సన్మానించారు. సందర్భంగా ఎస్సై జగదీష్ మాట్లాడుతూ గ్రామంలో కులమతాలకు పార్టీలకతీతంగా గ్రామాభి వృద్ధికి పాటుపడాలని ఆయన తెలిపారు. నూతనంగా ఎన్నికైన సోలిపురం పాలకవర్గానికి ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేశ్య, సమత, అంజయ్య, కోటయ్య, మాల్సూర్ , మదర్, బాలు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# చేతి పంపులు, బోర్లకు మరమ్మతులు



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : మండల పరిధిలోని వేప కుంట్ల గ్రామ పంచాయతీలో చేతి పంపులు, బోర్లకు మరమ్మ తులు చేపట్టారు. బుధవారం సర్పంచ్ బి. రమాదేవి రాజా ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చేతి పంపులు, బోర్లకు మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో మిషన్ భగీరథ త్రాగునీటికి ఏమైనా సమస్యలు వచ్చినా నీటి ఎద్దడిని నివారించేందుకు చేతి పంపులు, బోర్లకు మర్మతులు చేపట్టినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు దారా శ్యామ్, నాయకులు పి. రాజా, కిరణ్, పంచాయతీ సిబ్బంది సందీప్ పాల్గొన్నారు.

# అదనాన్‌కు సన్మానం



ప్రజాపక్షం/ రఘునాథపాలెం : అండర్ 14 స్టేట్ లెవల్ బాక్సింగ్ పోటీల్లో విజేతగా నిలిచిన కోయచలక గ్రామానికి చెందిన ఎస్‌కె అదనాన్‌ను గ్రామస్తులు సన్మానించారు. బుధ వారం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో బాక్సింగ్ పోటీల్లో విజేతగా నిలిచిన అదనాన్‌ను శాలు వతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బలుసుపాటి శేషయ్య, ఉప సర్పంచ్ మాధంశెట్టి హన్మంతరావు, నాయకులు చెరుకూరి పూర్ణచందర్‌రావు, మేళ్లచెరువు రాంప్రసాద్, చెరుకూరి సీతారాములు, అమరం అప్పారావు, మడుపు సత్యనారాయణ, జయరాజు, హరి, లక్ష్మి నారా యణ, వెంకటేశ్వర్లు, ఏసుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికులకు దుస్తులు పంపిణీ



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ బ్రాహ్మణపల్లి 7వ వార్డుకు చెందిన కాంగ్రె స్ నాయకుడు పిఎస్ కన్స్ట్రక్షన్, పిఎస్ సోలార్ సిస్టం నిర్వాహకుడు ఫణితి సైదు లు సుమారు 80 కార్మికులకు క్రిస్మస్ పం డుగ సందర్భంగా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఫణితి సైదులు మాట్లా డుతూ యేసు చూపిన మార్గంలో శాంతి నెలకొందని ఆయన అన్నారు. ప్రభువు చల్లని దీవెనలతో పదిమందికి సాయం చేసే శక్తి ఇవ్వడం జరిగిందని భవిష్యత్తులో కూడా ఎంతోమందికి అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వార్డు ప్రజలు పాల్గొన్నారు.